# 'కాకరపూవు పూచి నిమ్మకాయలు కాచిన' పద్యం

పదేళ్ల పసివయస్సులో మా యశోదక్క తీసుకెళ్లి నన్ను ఇంగ్లీషు మీడియంలో చేర్చేసింది. క్లాసులో చాలామటుకు 'సెయింట్ జోసఫ్స్' నించి వచ్చినవాళ్లే. అందరూ ఎడాపెడా ఇంగ్లీషులో మాట్లాడేసుకుంటున్నారు. నాకు ఇంగ్లీషు అక్షరాలు నాలుగు రకాలూ... 'వాటీ జువర్నేమూ' 'వాటీజువర్ ఫాదరూ'... 'హూాయీజ్దిస్సూ' లాంటి చిన్నచిన్న ప్రశ్నలకి చేతులు కట్టుకుని సమాధానాలు చెప్పడం మాత్రం తెల్సు.

కాన్వెంటు పిల్లల్ని చూస్తే భయం. (ఇప్పటి కాన్వెంట్ల లాంటిది కాదు ఆ సెయింట్ జోసఫ్స్) మౌళిగాడు నాతోపాటే కొత్తగా ఇంగ్లీషు మీడియంలోకి వచ్చినా, వాడు నాకన్నా మెరుగు. కారణం వాళ్లనాన్నగారు వాడికి ఇంగ్లీషు బాగా నేర్పించారు. ఓ నెలా నెలన్నర తర్వాత ఇక లాభంలేదు ఈ కాన్వెంటుగాళ్లని ఓడించాల్సిందే అనే నిర్ణయానికి వచ్చేసి మౌళి వాళ్ల నాన్నగారి దగ్గరికి ఇంగ్లీషు నేర్చుకోడానికి వెళ్లాను. ఆయన చిన్న పరీక్షలాంటిది పెట్టి పర్లేదు వీడికి ఇంగ్లీషు నేర్పొచ్చు అని నేర్పడానికి ఒప్పుకున్నారు.

ఆయన భాగవతుల జగన్నాథం. ఎక్కడో విజయనగరం దగ్గర వీరఘట్టంలో పంచాయితీ ఆఫీసు గుమాస్తాగా పనిచేసి రిటైరయ్యి మా కర్నూల్లో ఉద్యోగం చేస్తున్న పెద్ద కొడుకు దగ్గరికి వచ్చి ఉంటున్నారు. వాళ్ల పెద్దబ్బాయి గవర్నమెంటు ఉద్యోగి కాబట్టి, గవర్నమెంటు క్వార్టర్స్‌లో నివాసం. క్వార్టర్స్ నెం. 410. చుట్టూ పెద్ద ఆవరణ. దాని చుట్టూ దడి కట్టి మంచి తోటవేశారు మా జగన్నాథం మాస్టారు.

దాదాపు ఆరడుగులెత్తు. అడ్డంగా దువ్విన క్రాపూ... పెద్ద ఎర్రరంగు ఫ్రేము అద్దాలూ... గోచిపోసి కట్టిన నూలుపంచె... చేతుల బనియనూ... ఆయన ఉంటే తోటలోనో లేదంటే తన మడత పడక్కుర్చీలోనో ఉండేవారు. అరటి మట్టలో పొట్లం కట్టిన పొగాకు నమిలేవారు. మాకు పాఠాలు తోటలోనో లేదంటే వరండాలోనో చెప్పేవారు.

మొదలుపెట్టి 'రెన్ అండ్ మార్టిన్' అటు యిటుగా చెప్పేసారు. నేను మరచిపోలేని వ్యక్తుల్లో మా జగన్నాథం మాస్టారొకరు. నన్నాయన చిన్నప్పుడు 'కూసే గాడిద' అనేవారు. నాకూ ఆయనకూ అనుబంధం మాత్రం ఇంగ్లీషు వల్లకాదు. ఆశ్చర్యంగా తెలుగు పద్యం వల్ల. ఆయన చాలామంచి కవి. ఛందోబద్ధంగా పద్యాలు రాసేవారూ, చెప్పేవారు. ఆయనకి వచన కవిత్వం పట్ల అంత సదభిప్రాయం ఉండేది కాదు. మేము పెరిగి పెద్దై మేమూ

కవిత్వం రాస్తూన్న రోజుల్లో నాకూ ముప్పైఏళ్లొచ్చిం తర్వాత ఓ రోజున 'చూడిది ఏదో రాసాను' అని ఓ కాయితమిచ్చారు. వచన కవిత. అయినా అందులో చాలా కందపాదాలు కనబడ్డాయి నాకు. పద్యాల మీద మోజు మాత్రం ఆయన్ని కడదాకా వదల్లేదనే నా నమ్మకం. అప్పట్లో విజయవాడ స్టేషన్లో సమస్యాపూరణం అని ఓ కార్యక్రమమొచ్చేది. ప్రతి బుధవారం అనుకుంటాను గుర్తులేదు సరిగ్గా. కానీ ఆ కార్యక్రమం మాత్రం ఖచ్చితంగా వినేవాళ్లం.

సమస్యలూ, పూరణలూ రెండూ సరదాగానే కాదు, మెదడుకి పదును పెట్టేవిగా కూడా ఉండేవి. అదీకాక మా మాస్టారు పూరించి పంపిన పద్యం ఒకటి తప్పక ఉండేది.

ఆయన పూరించిన సమస్య నాకీ రోజుకీ ఒకటి గుర్తుంది. 'కాకరపూవు పూచి నిమ్మకాయలు కాచెన్' అన్నది ఆ సమస్య. దాన్ని మా మాస్టారు ఎలా పూరించారో చూడండి. ఈ పూరణలో మా మాస్టారుకి తోట మీద వున్న అభిమానం కనిపిస్తుంది.

పూరణ: "ఆకులు, మొగ్గలు, పిందెలు
ప్రాకట తరులందు దోచె వడి మా తోటన్
ప్రాకుల పయినెగ బ్రాకెను
కాకర... పువ్వు పూచి! నిమ్మకాయలు కాచెన్"
అదండీ...

* * *

మొన్న మౌళికి ఫోన్ చేసి "నాన్నగారి పద్యాలన్నీ ఏమయ్యాయిరా?" అనడిగాను. మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయిన మా రామగాడు (మాస్టారి రెండవ కుమారుడు) మాస్టారి పద్యాలన్నీ ఓ బౌండు పుస్తకంలో భద్రం చేసాడనీ... వాటినెప్పుడైనా పుస్తక రూపంలో తీసుకురావాలనీ కానీ... 'అర్థం' కారణాన ఆగాననీ చెప్పాడు.

"ఎలా వేయడం? ఎంతవుతుంది? డబ్బెక్కడ్నించీ తేవడం? నే పోయేలోగా అయ్యేనా నాన్నగారి పుస్తకం?" అని వాపోయాడు.

పద్యం అంతరించిపోతున్న ప్రస్తుత నేపథ్యంలో ఓ నిర్ణయానికొచ్చాం. ఎలాగో తంటాలుపడి మా మాస్టారి పద్యాలు పుస్తకంగా తీసుకువస్తాం... ●

గురుదేవో మహేశ్వరః